క్లుప్తంగా

మందసలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

మందస: మేజరు పంచాయతీ మందసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మందస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు మాట్లాడుతూ.. ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉచితంగా అందిస్తున్న ఈ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా నయం కాని వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అందజేస్తామన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పెంటమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.ఢిల్లేశ్వరి, ఏఎన్‌ఎం ఎస్.అన్నపూర్ణ, ఎల్‌టీ వై.నాగరాజు ఉన్నారు.

ఇంటి స్థలాలు చూపాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకరరావు

టెక్కలి: టెక్కలి పట్టణంలో పలువురు గొడగల కులస్తులకు ఇంటి స్థలాలు చూపాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు టెక్కలి తహసీల్దారు కె.ప్రవల్లికప్రియకు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ నేటికీ స్థలాలు చూపించలేదన్నారు. తక్షణమే ఇంటి స్థలాలు చూపించి ఆదుకోవాలని కోరారు.

బొరివంకలో స్కూల్ కాంప్లెక్స్


మాట్లాడుతున్న ధనంజయమజ్జి

కవిటి: పాఠశాల సముదాయ సమావేశాలను ప్రతి నెల నిర్వహించకోవడం ద్వారా ఆంగ్లభాషానైపుణ్యాలను అవగాహన చేసుకోవడం సాధ్యపడుతుందని ఎంఈవో ధనంజయమజ్జి, కాంప్లెక్స్ చైర్మన్ సనపల రామకృష్ణ అన్నారు. బొరివంకలో స్కూల్‌కాంప్లెక్స్‌ను గురువారం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ పాఠ్యాంశాల బోధనపై మాట్లాడారు. డీఆర్‌పీ రాజబాబు, గోవిందరావులు అభ్యసన సామర్థ్యాల్ని మెరుగుపర్చుకునే పద్ధతులకు సంబంధించిన సూక్ష్మ అంశాల్ని వివరించారు.

తక్షణ సాయం అందజేత


సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సోంపేట: శారదాపురం గ్రామానికి చెందిన గద్దె దుర్యోధన ర్యాబీస్ వ్యాధితో ఇటీవల మృతి చెందాడు. అతను వైఎస్సార్ బీమా పాలసీదారుడు. దీంతో అతని కుటుంబానికి తక్షణ సాయంగా రూ. పదివేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని దుర్యోధన కుటుంబ సభ్యులకు ఎంపీపీ నిమ్మన దాస్ గురువారం అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన బతకల బైరాగి ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, పాపారావు, తులసీరావు, శేఖర్, కోదండరావు, శ్యామలరావు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

సభను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

టెక్కలి: గుంటూరు జిల్లా నరసారావుపేటలో ఈ నెల పదో తేదీన జరగనున్న పీడిత ప్రజల పక్షపాతి మన్నం ప్రసాద్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్రావు కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. దళిత, ఆదివాసీ, ముస్లిం, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కోత ధర్మారావు, కేఎన్‌పీఎస్ ప్రతినిధులు రాము, హరీష్, చిన్న, శ్రీను, మల్లి, కృష్ణ, రమేష్ ఉన్నారు.

బెంతు ఒరియాల సమస్యను పరిష్కరించాలి

- వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్
- ప్రభుత్వ సలహాదారు సజ్జల, పలువురు ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి


ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారెడ్డితో సాయిరాజ్, బెంతు ఒరియా సంఘం నేతలు

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన బెంతు ఒరియా సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎం స్పెషల్ సెక్రటరీ ధనంజయరెడ్డిలను విజయవాడలో గురువారం వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. బెంతు ఒరియా సంఘం ప్రతినిధులతో కలిసి వినతిపత్రాలను అందజేశారు. బెంతు ఒరియా విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం వర్తింపు, వివిధ పరీక్షలకు దరఖాస్తు చేసేందుకు నేటివిటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో పాటు స్వయంశక్తిసంఘాల మహిళలకు అందిస్తున్న జగనన్న చేయూత పథకం వర్తింపజేయాలని ప్రత్యేకంగా అభ్యర్థించారు. వన్‌మెన్ కమిషన్ దర్యాప్తు నేపథ్యంలో బెంతు ఒరియాల కులధ్రువీకరణ అంశం పెండింగ్‌లో ఉండడంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఉన్న బెంతు ఒరియా స్వయంశక్తి సంఘాల సభ్యులకు చెల్లించాల్సిన జగనన్న చేయూత నిధులు గతంలో మాదిరిగా చెల్లించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. సాయిరాజ్ వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు దేవరాజ్‌సాహూ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ రజనీకుమార్‌దొళాయి, శివబిసాయి, సంతోష్ సాహూ, భాస్కర్ దొళాయి, జనార్దన్ దొళాయిలు ఉన్నారు. సమస్యల పట్ల సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించినట్టు సాయిరాజ్ తెలిపారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్



మాట్లాడుతున్న విద్యాసాగర్

పలాస: వైఎస్సార్ క్రాంతి పథంలో భాగంగా గ్రామాల్లో ఉన్నటువంటి డ్వాక్రా మహిళా సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. అందుకోసం వీవోఏలు సక్రమంగా పని చేయాలని..లేకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. పలాస మండల స్త్రీనిధి కార్యాలయంలో సోంపేట క్లస్టర్ పరిధిలోని ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్త్రీనిధి సిబ్బంది, రైతు ఉత్పత్తి సంఘాల సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని సంఘాలను ఏ- గ్రేడు స్థాయికి తీసుకురావాలన్నారు. స్త్రీ నిధి రుణాలను శత శాతం రికవరీ చేయాలన్నారు బ్యాంకుల నుంచి జీవనోపాధి రుణాలను ఇప్పించాలన్నారు. దీని కింద రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు వారు నడిపే యూనిట్ల మేరకు ఇప్పించాలన్నారు. 18 వందల రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసేలా పనిచేయాలని చెప్పారు. ఇప్పటి వరకు 963 మాత్రమే ఏర్పాటు అయ్యావన్నారు. గ్రామ సహాయకుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఉన్నతి రుణాలను సైతం శతశాతం వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామ సంఘాలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

ఉన్నతి పథకం కింద రూ.77 కోట్ల రుణాలు

ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఉన్నతి పథకం కింద జిల్లాలో రూ.77 కోట్లు రుణాలు అందజేసినట్టు విద్యాసాగర్ చెప్పారు. ఉన్నతి పథంకలో భాగంగా మహిళలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో ఉన్నటువంటి 575 మంది సభ్యులకు రూ.77 కోట్ల రుణాలు ఇచ్చిందన్నారు. ప్రతి మహిళకు రూ.4 లక్షల వ్యయంతో ఒక ఆటోను కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. దీన్ని సున్నా శాతం వడ్డీగా ఇచ్చామని చెప్పారు. సోంపేట క్లస్టర్ పరిధిలో 6,600 మంది సభ్యులకు రూ.33 కోట్లు లక్ష్యంగా రుణాలను అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు 2,735 మందికి రూ.15 కోట్లు రుణాలను అందజేసినట్టు వివరించారు. ఇక నుంచి రుణాలను వసూలు చేయడానికి పేటీఎంలు ఉపయోగించాలన్నారు. అందుకు సంబంధించిన పేటీఎం యాప్‌లను ప్రతి ఒక్కరు ఉపయోగించాలని చెప్పారు. ఈ సందర్భంగా సెల్ ఫోనులో పేటీఎం యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించారు. సమావేశంలో సోంపేట ఏరియా కోఆర్డినేటరు కె.మోహనరావు, స్త్రీ నిధి ఏజీఎం సత్యన్నారాయణ, లైవ్‌స్టాక్ డీపీఎం సన్యాసిరావు, ఉన్నతి డీపీఎం శ్రీధర్, ఐటీడీపీఎం కల్యాణచక్రవర్తి, జీవనోపాధి ఏపీఎం ఈశ్వరరావు, జిల్లా ఎల్‌సీ కోఆర్డినేటర్ బసవరాజు, పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి ఏపీఎంలు మల్లేశ్వరరావు, జాంబవతి, గోవిందరావు, ప్రసాదరావు, రమణమ్మ, ఉమారాణి, స్త్రీనిధి మేనేజరు రాము పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి సన్నిధిలో అన్నదానం


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి సన్నిధిలో గురువారం రాఖీపౌర్ణమి సందర్భంగా 500 మందికి దాతల విరాళాలతో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో వి.రాధాక్రిష్ణ తెలిపారు. అన్నదానం కోసం విరాళాలు ఇవ్వదలచినవారు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీరామమూర్తి

నందిగాం: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి వలంటీర్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన సైలాడ, మొండ్రాయివలస, దీనబంధుపురం, రాంపురం గ్రామాలకు చెందిన వలంటీర్లకు నియామక పత్రాలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని జోగారావు, జేసీఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, బోరుభద్ర సోమేశ్వరరావు, శంబాన దాలయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణలో భాగంగా నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పలు ప్రాంతాలకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈ ఎం.మురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పరిధిలో ఉన్న కేటీరోడ్డు, చేపల మార్కెట్, సూదికొండ, శివాజీనగర్, సాయికాలనీ, వివేకానందకాలనీ, పలాస పరిధిలోని ఉదయపురం, పురుషోత్తపురం ప్రాంతాలకు కరెంటు ఉండదని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గృహ సారథులకు ప్రమాద బీమా వర్తింపు

- మున్సిపల్ చైర్మన్ గిరిబాబు


ఈ-రసీదు చూపిస్తున్న చైర్మన్ గిరిబాబు తదితరులు

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న గృహసారథులకు అధిష్టానం అండగా ఉంటుందని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. 15వ వార్డులోకు చెందిన గృహసారథులకు ప్రమాద బీమా నమోదు ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారికి నెలకు రూ. 345 బీమా ప్రీమియంగా పార్టీ చెల్లిస్తోందన్నారు. పొరపాటున ప్రమాదం జరిగి చేయి, కాలును కోల్పోతే రూ. రెండు లక్షలు, మరణిస్తే అతని కుటుంబానికి రూ.5 లక్షలు అందించనున్నట్టు వివరించారు. గాంధీనగర్‌లో లాబాల పుష్పలత అనే గృహసారథి వివరాలను తొలుత నమోదు చేసి ఈ-రసీదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బడగల బళ్లయ్యనాయుడు, స్పోక్స్‌పర్సన్ శిష్టు గోపి, పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, 17వవార్డు పార్టీ ఇన్‌చార్జి కొంచాటి రాజాశ్రీకాంత్ పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్

రక్షాబంధన్ పండుగను గురువారం అందరూ ఉత్సాహంగా జరుపుకున్నారు. సోదరులకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టి..మిఠాయిలు తినిపించి అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులకు బ్రహ్మకుమారీలు రాఖీలుకట్టారు. సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్ అని నాయకులు అన్నారు.



టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ సిబ్బందికి రాఖీలు కడుతున్న విద్యార్థినులు


టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు పీతల హేమలత


టెక్కలిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు


కవిటిబల్లిపుట్టుగలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


కంచిలి: ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళ


వజ్రపుకొత్తూరు రూరల్: పీఏసీఎస్ అధ్యక్షుడు మధుకేశ్వరరావుకు రాఖీ కడుతున్న సోదరీమణులు


వజ్రపుకొత్తూరు రూరల్: సోదరుడుకి రాఖీ కడుతున్న ఎంపీపీ నీలవేణి

కోతుల సమస్య పరిష్కారంపై దృష్టి

- రూ. 2 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలను కొన్నేళ్లుగా వేధిస్తున్న కోతుల సమస్యను పరిష్కరించడంపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించారు. ఇందులో భాగంగా మున్సిపల్ సాధారణ నిధులు రూ. రెండు లక్షలు ఖర్చు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటి పరిధిలో చేపట్టనున్న ఎనిమిది ప్రధాన అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. ప్రధానంగా కోతుల సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు దిశగా సభ్యులు చర్చించారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. కోతులను పట్టి వాటిని దూరంగా అడవిలో విడిచిపెడితే అక్కడ అవి జీవనం సాగించేందుకు అవసరమైన వనరులు ఉన్నాయో..లేదో ముందుగా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, కమిషనర్ ఎన్.రమేష్ ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- విశ్వనాథపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


విశ్వనాథపురంలో సంక్షేమాన్ని వివరిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. విశ్వనాథపురం సచివాలయం పరిధిలోని విశ్వనాధపురం, గొల్లపేట, ఆనందపురం, జగ్గయ్యపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు లంచాలు తీసుకుని పథకాలు ఇచ్చేవారని.. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వాణి కుమార్తె డాక్టర్ హైందవి తల్లికి తోడుగా వచ్చి సంక్షేమంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, సర్పంచ్‌లు పంకు సింహాచలం, నూక సత్యరాజ్, గురువెల్లి గోవిందరావు, నేతింటి అప్పలస్వామి, నేతింటి సింహాచలం, కొండాల సిమ్మయ్య, పేడాడ దామోదర్‌రావు, సనపల జనార్దన, ఆర్.శివారెడ్డి, అక్కురాడ సురేష్, మెట్టు వాసు, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు చెంచులు, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, హనుమంతు దాలయ్య, ఎస్.నారాయణరావు,ం, పంచాయతీ కార్యదర్శులు ఎన్ఎస్ చైతన్య, పూతి సృజన, వీఆర్వో కూన దాలప్ప పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్


సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరునామాగా నిలిచారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. గుణుపల్లి, మోట్టూరు, ఒంకులూరు గ్రామాల్లో గురువారం ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి న్యాయం చేసేందుకు, గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు మంత్రి సీదిరి అప్పలరాజు చొరవ తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో మండల కో అర్డినేటర్ వడ్డి కరుణాకర్, సర్పంచ్‌లు, బూత్ కన్వీనర్‌లు, గృహసారథులు, శక్తి కోఆర్డినేటర్లు, పార్టీ నాయకులు జోగి అప్పారావు, తిర్రి రాజారావు, తిర్రి లక్ష్మీనారాయణ, కోడ నిరంజన్, మోహన్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


చంద్రమౌళిని పరామర్శిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కళింగ సంక్షేమ సంఘ నాయకుడు శాశుమాను చంద్రమౌళి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు 18వ వార్డు లలితానగర్‌లో ఉంటున్న చంద్రమౌళి నివాసానికి శనివారం వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బడగల బళ్లయ్యనాయుడు, పార్టీ మున్సిపల్ అధికార ప్రతినిధి శిష్టు గోపి, లంబాల రమేష్‌కుమార్ ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

పలాస: నేత్రదానంపై అవగాహన అవసరమని పలాస నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ చెప్పారు. అల్లుకోల సచివాలయంలో నేత్ర దాన పక్షోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నేత్రదానంపై కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే 25 మందికి నేత్ర పరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచ్ దువ్వాడ వామాక్షి, సచివాలయం కన్వీనరు దువ్వాడ రవి, ఎంఎల్‌హెచ్‌పీ డి.భారతి, ఆశ కార్యకర్త జి.నిర్మల పాల్గొన్నారు.

డిజిటల్ బోధన తప్పనిసరి

ఇచ్ఛాపురం రూరల్: ఆధునిక బోధన విధానాలను ఉపాధ్యాయులు అనుసరించాలని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. ఇందులో భాగంగా ప్రతీ తరగతి గదిలో డిజిటల్ విద్యా బోధన తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈదుపురంలో గురువారం జరిగిన పాఠశాల సముదాయ సమావేశంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. విద్యార్థులకు సబ్జెక్టులు మరింత నిశితంగా అర్థమయ్యేలా బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ డిస్‌ప్లే లేదా ప్రొజెక్టర్లు అమర్చాలని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్లు ఎస్.విశ్వనాథం, పావని, బి.తమ్మయ్య, శెట్టి ఢిల్లేష్, అరుణకుమారి ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు రుంకు వరలక్ష్మి ఒంటరిగా ఉంటోంది. ఈమె ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న సైనికులు పవనపుత్ర సంస్థ తరఫున రెండు నెలలకు సరిపడే బియ్యం, నిత్యావసర సరుకులను గురువారం అందజేసి అండగా నిలిచారు. బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన సార కుమార్, మాజీ సైనికుడు కొల్లి ఫాల్గుణరావు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన

సోంపేట: పాఠ్యప్రణాళిక ఆధారంగా బోధన జరగాలని విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. పెద్దశ్రీరాంపురం పాఠశాల సముదాయంలో హిందీ శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రిసోర్స్‌పర్సన్లు నిరంజన్ కడంగా, వెంకటరావు, ప్రధానోపాధ్యాయిని పద్మావతి పాల్గొన్నారు.

చంద్రబాబు, అచ్చెన్నాయుడుపై పోలీసులకు ఫిర్యాదు

టెక్కలి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు కోరారు. ఈ మేరకు టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ఇటీవల లోకేష్ తన పాదయాత్రలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని.. ఆయనతో పాటు చంద్రబాబు, అచ్చెన్నాయుడు సైతం శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రసంగాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో సోషల్ మీడియా కన్వీనర్ ఎ.లెనిన్‌తో పాటు కూరాకుల అప్పారావు, పీస పాపారావు, కె.నరేష్, ఎం.సాయి కిరణ్, జి.దుర్గాప్రసాద్ ఉన్నారు.